
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
శనివారం 27 ఏప్రిల్ 2024



డిప్యూటీ తహసీల్దార్, రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

కొందుర్గు, ఏప్రిల్ 26: ఆర్వోఆర్, పహాణీ కోసం విశ్వనాథ్‌పూర్‌కు చెందిన అశోకొరెడ్డి(ఆర్మీ జవాన్) నుంచి రూ.40వేలు డిమాండ్ చేసిన కొందుర్గు డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కిష్టయ్య, రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్‌ను కలెక్టర్ సస్పెన్షన్ చేసినట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. అశోకొరెడ్డికి తన మూడున్నర ఎకరాల భూమికి సంబంధించి ఆర్వోఆర్, పహాణీలు కావాలని అశోకొరెడ్డి అన్న మహేశ్వర్‌రెడ్డి 2024 జనవరిలో దరఖాస్తు చేయగా.. అశోకొరెడ్డి రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాడు. రికార్డు అసిస్టెంట్ బాల్‌రాజ్, కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ప్రైవేట్ వ్యక్తి ఆయనను రూ.40వేలు డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

ఇక్కడ పచ్చదనం..



ఎండలు ముదురుతున్న కొద్దీ భూగర్భజలాలు తగ్గుతున్నాయి. బోరుబావులు ఆగి ఆగి పోస్తుండడంతో చేతికందే దశలో ఉన్న వరి పంట కళ్లముందే నిలువునా ఎండిపోతోంది. అన్నదాతలు ఏం చేయాలో తోచక కుమిలిపోతున్నారు. యాచారం మండల పరిధి కుర్మిద్ద, ఏనెకింది తండా, మేడిపల్లి, తమ్మలోనిగూడ, మంగలిగడ్డతండా, మర్లకుంట తండా, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో వరి ఈనే దశలో ఉండగా నిలువునా ఎండిపోయింది. ఆయా గ్రామాల్లో 128 ఎకరాల్లో రైతులు వరి సాగుచేయగా పూర్తిగా ఎండిపోయింది. కాగా, తాటిపర్తి, నానక్‌నగర్ గ్రామాల్లో చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో రైతులు బోరుబావుల ద్వారా నీరందించి పంటను కాపాడుకుంటున్నారు. దాంతో వరిపైరు ఏపుగా పెరిగింది.

- యాచారం, ఏప్రిల్ 26

అక్కడ ఎండుముఖం..



ముగిసిన నామినేషన్ల పరిశీలన

- చేవెళ్లలో 17 నామినేషన్ల తిరస్కరణ
- బరిలో 47 మంది

రంగారెడ్డి అర్బన్/మేడ్చల్, (ఆంధ్రజ్యోతి) ఏప్రిల్ 26 : చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల్లో మరో కీలక ఘట్టం ముగిసింది. అధికారులు నామినేషన్ల పరిశీలన పూర్తి చేశారు. సరైన ఫార్మాట్‌లో లేని నామినేషన్లను తిరస్కరించారు. దాంతో బరిలో నిలిచేది ఎవరో తేలిపోయింది. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి మొత్తం 64 అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, పార్లమెంట్ స్థానానికి దాఖలైన నామినేషన్లలో 17 నామినేషన్లను తిరస్కరించారు. మిగిలిన 47 నామినేషన్లకు జిల్లా ఎన్నికల అధికారి శశాంక ఆమోదం తెలిపారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లకు ఓకే చెప్పారు. ఏప్రిల్ 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 13న పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటించనున్నారు.

మల్కాజిగిరిలో 77 నామినేషన్లు తిరస్కరణ

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి 114 మంది అభ్యర్థులు 177 నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రిటర్నింగ్ అధికారి గౌతమ్ సరైన ఫార్మాట్ లేని 77 నామినేషన్లను తిరస్కరించారు. కాగా, 37 అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే ఆమోదించినట్లు ఎన్నికల పరిశీలకులు డాక్టర్ రాజీవ్ శుక్లా తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలకు సహకరించాలి

- ఎన్నికల అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి



ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికలు సాఫీగా నిర్వహించేందుకు తగిన కార్యాచరణతో ముందుకుపోతున్నామని, రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో కె.అనంతరెడ్డి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 343 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 107 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవిగా గుర్తించామన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ మొదలైందని, మే 8 వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు రూ.90.84 లక్షల నగదు, రూ.1.28 లక్షల విలువచేసే ఆభరణాలు, రూ.9.68 లక్షల విలువచేసే మద్యం, 668.39 కిలోల నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


కందుకూరు : పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలని, ఇబ్బందులు రాకుండా సంబంధిత సిబ్బందితో సమన్వయంతో కలిసి పనిచేయాలని ఆర్డీవో, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి సూరజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో సెక్టర్ అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో 537 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయగా, 48మంది సెక్టోరియల్ అధికారులను నియమించడం జరిగిందన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న వారికి ఓటరు స్లిప్పులను బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, కందుకూరు, మహేశ్వరం, బాలాపురం, మండలాల తహసీల్దార్లు కె.గోపాల్, పి.విజయలక్ష్మి, కె.మాధవిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

కేశంపేట : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని షాద్‌నగర్ ఆర్డీవో వెంకట మాధవరావు సూచించారు. కేశంపేట మండల పరిధిలోని కొనాయపల్లి గ్రామ సమీపంలోని చెక్‌పోస్టును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలను తనిఖీ చేసే సమయంలో వీడియో చిత్రీకరణ చేపట్టాలని, తనిఖీ సమయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీని అధికారులు ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో బీఎల్‌వోలు ఓటర్లకు స్లిప్పులను అందిస్తున్నారు. కొత్తపేటలో ఓటరు స్లిప్పుల పంపిణీని ఆర్డీవో వెంకట మాధవరావు పరిశీలించి, ఓటర్లకు స్లిప్పులను అందించారు. ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. తహసీల్దార్ మీర్ ఆజంఅలీ, ఆర్ఐ నివేదిత పాల్గొన్నారు.



భానుడి భగభగలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో బేజారవుతున్నారు. మధ్యాహ్నం వడగాలులు, రాత్రి ఉక్కపోతతో బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 6 వరకు జనం బయటకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. ఏదైనా పనిమీద బయటకు వెళితే శీతలపానీయాలు తప్పక తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూసినా రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. కాగా, అత్యవసర పని ఉంటేనే బయటకు వెళ్లాలని వైద్యులు సూచిస్తున్నారు. ఏప్రిల్‌లో ఉష్ణోగ్రతలు ఇలా ఉన్నాయంటే మేలో ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు.

నిప్పుల కుంపటి!

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- మధ్యాహ్నం వడగాలులు, రాత్రి ఉక్కపోత
- ఉక్కిరిబిక్కిరవుతున్న చిన్నారులు, వృద్ధులు
- శేరిలింగంపల్లి, హఫీజ్‌పేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలి : వైద్యులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26) :

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. రోహిణి కార్తెకు ముందే రోల్లు పగిలేలా ఉష్ణోగ్రలు ఠారెత్తిస్తున్నాయి. వారం రోజుల నుంచి భానుడి ఉగ్రరూపానికి జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉష్ణోగ్రతలకు తోడు వడగాలులు పెరగడంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 దాటితే ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలకు పైగానే చేరాయి. మే నెల మధ్యలో నమోదు కావాల్సిన ఉష్ణోగ్రతలు ఏప్రిల్ చివరి వారంలోనే రికార్డవుతున్నాయి. అనేకచోట్ల వడగాలులు, కొన్నిచోట్ల తీవ్రమైన వడగాలులు వీస్తున్నాయి. ఫలితంగా జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టేందుకు జంకుతున్నారు. వడగాలులు రోజురోజుకూ అధికమవుతున్నాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలం ఘన్‌పూర్‌లో శుక్రవారం అత్యధికంగా 43.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి, హఫీజ్‌పేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో 43.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తొర్మామిడి-నాగారంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, జనం ఎండ వేడిమికి చెట్లనీడను వెదుకుతున్నారు. ఇంట్లో ఉక్కపోత భరించలేక చెట్ల కింద సేద తీరుతున్నారు. రాత్రి వేళలో ఫ్యాన్ల నుంచి వచ్చే వేడిగాలి భరించలేక ఆరుబయట పడుకుంటున్నారు. చిన్నపిల్లల, వృద్ధులు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో నమోదైన గరిష్ఠ ఉష్ణోగ్రతల వివరాలు

తేదీ	రంగారెడ్డి	వికారాబాద్	మేడ్చల్
26	43.5	43.1	43.4
25	42.4	41.1	42.9
24	42.6	41.5	42.8
23	42.9	42.5	43.3
22	42.9	42.5	43.3

ఎండ వేడిమికి జనం విలవిల

ఎండతో పాటు విపరీతమైన ఉక్కపోత, వడగాలుల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగానే ఉన్నప్పటికీ శుక్రవారం నాటి ఎండకు జనం బెంబేలెత్తిపోయారు. ఎక్కడ చూసినా రహదారులు నిర్మానుష్యంగా మారిపోయాయి. వృద్ధులు, చిన్నారులు ఇళ్లలో ఉన్నప్పటికీ ఉక్కపోతను తట్టుకోలేకపోతున్నారు.

మోగుతున్న ప్రమాద ఘంటికలు

వాతావరణ శాఖ లెక్కల ప్రకారం ఎండ తీవ్రతల ఆధారంగా ప్రమాదకర స్థాయిని అంచనా వేస్తారు. వేసవిలో 35 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదైతే.. దానిని సాధారణంగా పరిగణిస్తారు. 35 నుంచి 40 డిగ్రీల వరకు మోస్తరు ఉష్ణోగ్రతలుగా గుర్తిస్తారు. జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. 40 నుంచి 45 డిగ్రీల వరకు ప్రమాదకరంగా భావిస్తారు. అప్రమత్తత అవసరం. ఇక 45 డిగ్రీలు దాటితే అత్యంత ప్రమాదకరంగా హెచ్చరికలు జారీ చేస్తారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుంటే మంచిది. బయటకు వెళ్లినా తగిన రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ప్రమాదకర స్థితి ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

ఉష్ణోగ్రతలు పెరగడంతో తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. తరచూ నీటిని తాగుతుండాలని, ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు రాకపోవడమే మంచిదని సూచిస్తున్నారు. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి. పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకూడదు. శరీరాన్ని చల్లబరిచే పండ్లు, కూరగాయలు తీసుకోవాలని చెబుతున్నారు.



జోరుగా శీతలపానీయాల విక్రయం

వేడి తీవ్రత పెరిగిన నేపథ్యంలో కొబ్బరి బోండాలకు గిరాకీ బాగా పెరిగింది. పండ్ల రసాలు, శీతల పానీయాల దుకాణాలు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. మజ్జిగ విక్రయాలు గతంలో పోల్చితే రెండు రెట్లు పెరిగాయి. రహదారులపై శీతల పానీయాలు, సోడా, షర్బత్ దుకాణాలు పెద్దఎత్తున వెలిశాయి. జ్యూస్ కోసం పుచ్చకాయలు, ద్రాక్ష, అరటి పండ్లకు గిరాకీ పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ఎండ పెరిగిన నేపథ్యంలో క్యాప్(టోపీ)లకు కూడా డిమాండ్ పెరిగింది. మహిళలు గొడుగులతో రక్షణ పొందుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్లే మహిళలు, యువతులు స్కార్ఫ్‌లతో కళ్లకు రక్షణ కల్పిస్తున్నారు. చలువ అద్దాలు ధరిస్తున్నారు. పురుషులు కూడా తలకు నూలు వస్త్రం చుట్టి హెల్మెట్ ధరించడం ద్వారా కొంతవరకు ఉపశమనం పొందుతున్నారు.



మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లొద్దు

పెరుగుతున్న ఎండల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా పనులుంటే 10 గంటల్లోగా పూర్తి చేసుకోవాలి.. లేదంటే సాయంత్రం 5 గంటల తర్వాత చేసుకోవాలి. మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దు. ఎండాకాలం దూర ప్రయాణాలు మానుకోవాలి. లేదంటే వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఎల్లప్పుడూ ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవడం మంచిది.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి



కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తున్న కేసీఆర్

కేసీఆర్‌కు ఘన స్వాగతం

- మహబూబ్‌నగర్‌లో రోడ్‌షోకు వెళుతుండగా షాద్‌నగర్ బైపాస్ రోడ్‌లో స్వాగతం
- మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో రోడ్‌షోకు భారీగా తరలిన బీఆర్ఎస్ శ్రేణులు
- గులాబీమయంగా షాద్‌నగర్ బైపాస్ రోడ్డు
- కార్యకర్తలకు అభివాదం చేసిన కేసీఆర్

షాద్‌నగర్, ఏప్రిల్ 26: మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు షాద్‌నగర్ బైపాస్ రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలు కేసీఆర్ వాహనానికి గుమ్మడికాయలతో దిష్టితీసి.. జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. పల్లెలన్నీ కారు, సారును కోరుకుంటున్నాయని, మరోమారు మన సత్తా చాటే సమయం వచ్చిందని నాయకులు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే రోడ్‌షోకు వెళ్తున్న క్రమంలో కేసీఆర్‌కు నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేశారు. ఆయనకు స్వాగతం పలికేందుకు గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో శ్రేణులు తరలిరావడంతో షాద్‌నగర్ బైపాస్ రోడ్ గులాబీమయంగా మారింది. అనంతరం వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు మహబూబ్‌నగర్‌లో నిర్వహించే కేసీఆర్ రోడ్‌షోకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ మన సార్.. కేసీఆర్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే స్ఫూర్తిని మున్ముందు కొనసాగించాలని కోరారు. లోక్‌సభ ఎన్నికల్లో మన సత్తాను చాటాలని, కారు గుర్తుకు ఓటువేసి బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉలిక్కిపడిన నందిగామ

- అలెన్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం
- నాలుగు గంటల పాటు ఉత్కంఠ
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పరుగులు పెట్టిన ఉద్యోగులు, కార్మికులు
- భయాందోళనకు గురైన స్థానికులు
- రూ.12 కోట్ల మేర ఆస్తి నష్టం



మంటలు చెలరేగడంతో దగ్ధమవుతున్న పరిశ్రమ

షాద్‌నగర్/నందిగామ, ఏప్రిల్ 26: నందిగామ మండల కేంద్రంలోని అలెన్ హోమియో, హెర్బల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పరిశ్రమలో నిర్మాణ పనులు జరుగుతుండగా మొదటి అంతస్తులో వెల్డింగ్ పనులు చేస్తున్నారు. దాంతో నిప్పురవ్వలు ఎగిసి కిందపడటంతో.. హోమియో మాత్రలకు వినియోగించే ఆల్కహాల్ వంటి అనేక రసాయనాలపై పడ్డాయి. పెద్దఎత్తున మంటలు చెలరేగి దట్టమైన పొగ కమ్ముకోవడంతో కార్మికులు ప్రాణాలను గుప్పిట్లో పెట్టుకుని అరుపులు, కేకలతో పరుగులు పెట్టారు. కాగ, అదే ప్రాంతంలో ఆల్కహాల్‌తో నిల్వ ఉంచిన పదిహేను బ్యారెల్స్‌కు కూడా నిప్పంటుకోవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగి పరిశ్రమ మొత్తం దగ్ధమైంది. ఈక్రమంలో పరిశ్రమలోని నాలుగో అంతస్తులో కార్మికులు తప్పించుకునే అవకాశం లేక అక్కడే నిలబడిపోయారు. దాంతో ఏ క్షణం ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ కొనసాగింది. అగ్నిమాపక సిబ్బంది మంటల్లో చిక్కుకున్నవారిని సురక్షితంగా బయటకి తీసుకురావడంతో మిగతా కార్మికులు, ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

భయాందోళనలో నందిగామ వాసులు

మండల కేంద్రంలోని అలెన్ పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నందిగామ ప్రజలు ఉలిక్కిపడ్డారు. మండల కేంద్రంతో పాటు సుమారు 6 కిలోమీటర్ల వరకు దట్టమైన పొగ అలుముకోవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏదో భారీ అగ్ని ప్రమాదం జరిగిందన్న ఆలోచనతో ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. దాంతో గంటల తరబడి పాత జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ అయ్యింది. పరిశ్రమల్లో పని చేస్తున్న తమ వారికి ఏదైనా ప్రమాదం జరిగిందోనని తెలుసుకోవడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. పరిశ్రమలో పెద్దఎత్తున ఎగిసిపడుతున్న మంటలను చూసి మండల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. రూ.12 కోట్ల మేర నష్టం వాటిల్లింది. ప్రాణనష్టం జరగలేదని ఫైర్ సిబ్బంది తెలపడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రమాద సమయంలో 75 మందికి పైగా కార్మికులు

అలెన్ పరిశ్రమలో ప్రమాదం జరిగినప్పుడు 75 మందికి పైగా కార్మికులు పని చేస్తున్నారు. పరిశ్రమలో మొదటి అంతస్తులో ప్రమాదం చోటు చేసుకోగానే.. వెంటనే పరిశ్రమ వెనుక భాగంలో ఉన్న మెట్లమీదుగా బయటకు చేరుకున్నారు. రెండో అంతస్తులో కూడా మంటలు చెలరేగడంతో అందులో ఉన్న కార్మికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షితంగా బయటకు వచ్చారు. నాలుగో అంతస్తులో ఉన్నవారిని మాత్రం సాయి చరణ్ అనే బాలుడు.. ఎలాంటి ప్రమాదం జరుగకుండా తాడు సాయంతో బయటకు తీసుకురావడం గమనార్హం. ప్రమాదంలో పరిశ్రమ నాలుగో అంతస్తు నుంచి కిందకి దూకిన కె.లక్ష్మి నారాయణ స్వామి తీవ్రంగా గాయపడటంతో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదం : డీసీపీ

పరిశ్రమలో వెల్డింగ్ పనుల వల్లనే ప్రమాదం సంభవించిందని డీసీపీ నారాయణరెడ్డి తెలిపారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదన్నారు. షాద్‌నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్‌కు చెందిన 7 ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చాం. స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చాం.

సంఘటన దురదృష్టకరం : ఎమ్మెల్యే

నందిగామ మండల కేంద్రంలోని అలెన్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం దురదృష్టకరమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న ఆయన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. భయాందోళనకు గురైన కార్మికులకు భరోసా ఇచ్చారు.



పరిశ్రమ ఎదుట మహిళా కార్మికులు

ఆర్టీసీ సిబ్బందిపై దాడులు చేస్తే కఠిన చర్యలు


ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 26: ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని వికారాబాద్ ఎస్పీ కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎందరో ప్రయాణికులను రోజూ సురక్షితంగా, క్షేమంగా తమ గమ్య స్థానాలకు చేర్చే ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లపై కొందరు ప్రయాణికులు అసహనానికి గురై దాడులకు పాల్పడిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నట్లు గుర్తుచేశారు. వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా ఆర్టీసీ సిబ్బందిపై దాడులకు పాల్పడినా, లేక బెదిరించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. ఇలాంటి ఘటనలు జరిగితే వెంటనే 100కు ఫోన్‌చేయాలని సూచించారు.

జానపద కళాకారుడికి ఉగాది పురస్కారం

● ఢిల్లీలో ఈ నెల 29న ప్రదానం


అశోక్

తాండూరు, ఏప్రిల్ 26: తాండూరుకు చెందిన ఫైన్ ఆర్ట్స్ కల్చర్ అకాడమి అధ్యక్షుడు, జాతీయస్థాయి జానపద కళాకారుడు ఎల్. అశోక్‌కు ఉగాది పురస్కారం వరించింది. ఈనెల 29న(సోమవారం) దేశరాజధాని ఢిల్లీలోని లోక్ కళామంచ్‌లో శిఖరం ఆర్ట్స్ అకాడమి హైదరాబాద్ సంస్థ 2024వ సంవత్సరంకిగాను జానపద విభాగంలో జాతీయ స్థాయి పురస్కారం అందుకోనున్నారు. తనకు ప్రోత్సాహం అందించిన విఠల్ నాయక్, గూళి శివకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


బొంరాస్‌పేట్‌లో కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న అధికారులు

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26: వరి ధాన్యం కొనుగోళ్లను జిల్లా అధికారులు దగ్గరుండి ప్రారంభించారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన ధాన్యం కొనుగోలు చేసేదెన్నడో అనే కథనానికి స్పందించిన అధికారులు బొంరాస్‌పేట్, మెట్లకుంట తదితర గ్రామాల్లో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలను పరిశీలించారు. పౌరసరఫరాల జిల్లా అధికారిణి నాగమణి, రాజేశ్వర్‌లు బొంరాస్‌పేట్ మండలంలో ధాన్యం తూకాలు వేయించారు. బొంరాస్‌పేట్, కొత్తూర్, దుప్‌చర్ల, చౌదర్‌పల్లి, చిలుముల్ మైలారం, లగచర్ల గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలకు 5వేల చొప్పున గన్నీ బ్యాగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఏర్పుమళ్ల గ్రామానికి సమీపంలో గల రైస్‌మిల్లు నుంచి గన్నీ బ్యాగులు కేటాయించినట్లు తెలిపారు. ప్రతీ కేంద్రంలో తేమ శాతం 17 ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. బొంరాస్‌పేట్‌లో బస్తాలు తూకం వేసేంత వరకు పరిశీలించి వెళ్లారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఏపీయం కిష్టప్ప, సిబ్బంది మల్లికార్జున్, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

వికారాబాద్, ఏప్రిల్ 26: పాలిటెక్నిక్, కళాశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో పాలిసెట్ ప్రవేశ పరీక్షకు విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వికారాబాద్ జిల్లా పాలిసెట్ కోర్డినేటర్, ప్రిన్సిపాల్ ఎం. పరమేశ్వర్ తెలిపారు. వచ్చేనెల 24వ తేదీన ప్రవేశపరీక్ష ఉన్న నేపథ్యంలో వికారాబాద్ పాలిటెక్నిక్, కళాశాలలో మేనెల 1నుంచి 21వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మరోసారి ఎంపీగా అవకాశం కల్పించండి: రంజిత్‌రెడ్డి


తాండూరులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలో భాగంగా బైకులు నడిపిస్తున్న రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు రూరల్, ఏప్రిల్ 26: వేలకోట్లు ఉన్నా ప్రజాసేవ చేయలేని వ్యక్తి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని మల్కాపూర్, కరన్‌కోట్ గ్రామాల్లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఓటువేసి అమూల్యమైన ఓటును వృథా చేసుకోవద్దని సూచించారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ గెలిస్తే ఉచిత పథకాలు ఇవ్వదన్నారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గతంలో ఎంపీగా ఉన్నప్పుడు చేవెళ్లకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. వేల కోట్లు ఉన్నా ప్రజలకు సేవ చేయలేదన్నారు. కరోనా సమయంలో ప్రజలను ఆదుకోలేదన్నారు. అంతెందుకు తన అపోలో ఆస్పత్రిలో ఒక్కరూపాయి బిల్లు కూడా తగ్గించలేదని దుయ్యబట్టారు. మరోసారి చేవెళ్ల ప్రజలు ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరు అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనను నమ్మి గెలిపించిన తాండూరు ప్రజలకు రుణపడి ఉన్నానని, వారికి సేవ చేసుకుంటానని అన్నారు. ఎన్నికల తర్వాత తాండూరు అభివృద్ధిపై దృష్టి సారిస్తానని అన్నారు. జూన్ 4 తర్వాత ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని, రేషన్ కార్డు, కొత్త పెన్షన్లు కూడా మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తంచంద్ పాల్గొన్నారు.

తాండూరులో భారీ బైక్ ర్యాలీ

తాండూరు: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరులోని విలియమూన్ చౌరస్తా నుంచి సాయిపూర్ వరకు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డితో కలిసి పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సాయిపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు అనేవి మన పిల్లల భవిష్యత్తుపై ఆధారపడి ఉన్నాయని అన్నారు. మతతత్వ పార్టీలు ఓట్లు అడగడానికి వస్తున్నారని ప్రజలు వారికి ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ ధారాసింగ్, మాజీ ఎంపీపీ కర్ణం పురుషోత్తంరావు పాల్గొన్నారు.

అమూల్యమైన ఓటు కాంగ్రెస్‌కే వేయాలి

వికారాబాద్: ప్రజలు తమ అమూల్యమైన ఓటు కాంగ్రెస్‌కే వేయాలని చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి సతీమణి గడ్డం సీతారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వికారాబాద్ మున్సిపల్ పరిధిలో శుక్రవారం ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వ సుజాత, సుధాకర్‌రెడ్డి, విశ్వనాథం సత్యనారాయణ, మురళి, మాలే గాయత్రి లక్ష్మణ్, మోముల స్వాతి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అదేవిధంగా పూడూరు మండలం చీలాపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నేడు యాలాల మండలంలో ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం: రంజిత్‌రెడ్డి

శంకర్‌పల్లి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మహాలింగపూరం గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు ఆయన సమక్షంలో శంకర్‌పల్లి పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఇన్‌చార్జి పామెన భీంభరత్, మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్‌చైర్మన్ వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బండారు ఆగిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు దేవర వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్లావాడ, జాలగూడ గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం చేశారు. అదేవిధంగా నేడు రంగారెడ్డి జిల్లా కందుకూరులో రంజిత్‌రెడ్డి ప్రచారం నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ జంగారెడ్డి తెలిపారు. అదేవిధంగా సరూర్‌నగర్‌లో నిర్వహించిన ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు బేరే బాలకిషన్, పారుపల్లి దయాకర్‌రెడ్డి, ఆకుల అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు శంకర్‌యాదవ్, ఆల్విన్ కాలనీలో జరిగిన ప్రచారంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు సంజీవరెడ్డి, కృష్ణముదిరాజ్‌తో కలిసి ధరణినగర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పార్టీ నాయకులు రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, పాండుగౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, సంగమేష్, అగ్రవాసు, బాలస్వామి, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేఎల్లార్

ఈనెల 30, మే 5 న మహేశ్వరంలో సీఎం పర్యటన

మహేశ్వరం, ఏప్రిల్ 26 : చేవెళ్లలో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 30, మే 5న మహేశ్వరం నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కెఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు స్వయంగా సీఎం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని రంగంలోకి గిగుతున్నారని చెప్పారు. అందుకోసం ఈనెల 30, మే 5న నియోజకవర్గంలోని మీర్‌పేట, బడంగ్‌పేట, సరూర్‌నగర్, ఎల్బీనగర్, మహేశ్వరం, తుక్కుగూడ, కందుకూరుల్లో సీఎం రోడ్‌షోతో పాటు కార్నర్ మీటింగ్‌లు ఉంటాయన్నారు. సీఎం రోడ్‌షోలను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పార్టీని తిరుగులేని శక్తిగా తయారు చేయాలని, అందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ ఎన్నికల అనంతరం కేంద్రంలో కూడా కాంగ్రెస్‌దే అధికారమని చెప్పారు. సమావేశంలో టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పటిష్ట భద్రత


పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీపీ

ఆమనగల్లు, ఏప్రిల్ 26 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో, సమస్యాత్మక గ్రామాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తామని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి చెప్పారు. శుక్రవారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల పరిధిలోని జంగారెడ్డిపల్లి, సాలార్పూర్, ఎక్వాయిపల్లి, మంగళపల్లి, కడ్తాల్, మైసిగండి, పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని చెప్పారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకునేలా తాము తగు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఎస్సైలు వరప్రసాద్, బాల్‌రాంనాయక్ తదితరులున్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి


పోస్టర్‌ను విడుదల చేస్తున్న జీపీ కార్మికులు

కేశంపేట, ఏప్రిల్ 26 : గ్రామ పంచాయతీ కార్మికులకు కార్మిక చట్టాలను అమలు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్మికులు, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మేడే వాల్‌పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీపీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆటో, హమాలీ ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాలను తీసుకరావాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, మండలాధ్యక్షుడు జంగయ్య, రవి, యాదయ్య, నరసింహ, స్వాతి, సురేష్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


పరిగిలోని ఏఆర్‌వో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ రాజీవ్‌చోప్ర

ఏఆర్‌వో కార్యాలయం సందర్శన

పరిగి, ఫిబ్రవరి 26: చేవెళ్ల లోక్‌సభ ఎన్నికల ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ రాజీవ్‌చోప్రా శుక్రవారం పరిగిలోని అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఏఆర్వో ఎం.వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, సీఐ శ్రీనివాస్‌లతో సమావేశమయ్యారు. అనంతరం సోషల్‌మీడియా కేంద్రాన్ని సందర్శించారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చుల వివరాలు గురించి అరా తీశారు. ఎన్నికల ఖర్చుల బృందాలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల ఖర్చుల వివరాల్లో తప్పులు లేకుండా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి వివరాలు సేకరించాలని సూచించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కాలురామ్‌రావత్

వికారాబాద్, ఏప్రిల్ 26 : ఎన్నికలు గట్టి నిఘా, బందోబస్తుల మధ్య ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని ఎన్నికల పోలీస్ పరిశీలకులు కాలురామ్ రావత్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం వికారాబాద్ నియోజకవర్గం మేరీ ఏనాట్ పాఠశాలలో ఈవీఎం, వీవీ ప్యాట్ల స్ట్రాంగ్‌రూమ్‌ను ఎస్పీ కోటిరెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మలతో కలిసి సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. స్ట్రాంగ్‌రూమ్ భద్రతకు విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని పలకరించి, వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కలెక్టరేట్‌కు వచ్చిన కాలురామ్ రావత్‌ను కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్, వికారాబాద్ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ పుష్ప గుచ్ఛాలతో స్వాగతించారు. స్ట్రాంగ్‌రూమ్ సందర్శనలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

సమన్వయంతో పనిచేద్దాం

» తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

తాండూరు, ఏప్రిల్ 26: తాండూరు శ్రీభావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సహకరించాలని తాండూరు ఆర్డీవో శ్రీనివాస రావు కోరారు. ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం వివిధ శాఖల అధికారులు, దేవాదారు శాఖ అధికారులు, దేవాలయ ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఈ నెల 30 నుంచి వచ్చే 8 వరకు జాతర బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఉత్సవాల్లో రథోత్సవం, లంకదహన ఘట్టాలు ప్రధానమైనని, ఈ ఉత్సవాలను తిలకించేందుకు వేల మందిగా తరలివచ్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్డీవో కోరారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ అశోక్‌కుమార్, టౌన్ సీఐ సంతోష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డి, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, విద్యుత్ శాఖ ఏడీ ఆదినారాయణ, ఫైర్ అధికారి నాగార్జున పాల్గొన్నారు.

అదనపు ఈవీఎంలు తప్పవా?

మల్కాజ్‌గిరిలో అంచనాకు మించి నామినేషన్లు



మేడ్చల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : మల్కాజిగిరి నియోజకవర్గానికి ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో ఎన్నికల అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా మల్కాజిగిరి స్థానానికి నామినేషన్లు దాఖలయ్యాయి. ఒక బ్యాలెట్ యూనిట్‌లో నోటాతో కలిపి 16 మంది అభ్యర్థుల పేర్లు పొందుపర్చవచ్చు. అంతకు ఎక్కువ మంది ఉంటే అదనపు ఈవీఎంలు ఏర్పాటు చేయాలి. ఒక కంట్రోల్ యూనిట్‌కు 51 ఈవీఎంలను అనుసంధానించొచ్చు. ప్రస్తుతం మల్కాజిగిరినియోజకవర్గానికి 16మందికి మించకపోవచ్చని అధికారులు భావించారు. ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఏకంగా 138మంది నామినేషన్లు వేశారు. శుక్రవారం నామినేషన్లను పరిశీలించారు. ఉపసంహరణకు గడువు 29 వరకు ఉంది. చివరకు పోటీలో ఉండేది ఎంత మంది అనే విషయం తేలుతుంది. 16 మందికి మించి ఎంత మంది ఉంటే ఆ మేరకు అదనపు బీయూలను ఏర్పాటు చేస్తారు. అయితే ఎన్నికల సంఘం ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక్కోబ్యాలెట్ యూనిటే పంపింది. అభ్యర్థుల సంఖ్య ఎక్కువుంటే మళ్లీ అవసరమైన బ్యాలెట్ యూనిట్లు తెప్పించి ర్యాండమైజేషన్ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఉపసంహరించుకోకుంటే మళ్లీ పని మొదటికి వచ్చినట్లేనని అధికారులు తల పట్టుకుంటున్నారు.

చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి

» మళ్లీ ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

» బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


మొయినాబాద్ : అజీజ్‌నగర్‌లో సంకల్ప పత్రాన్ని విడుదల చేస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : చేవెళ్ల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల ప్రజల అభివృద్ధి కోసం పార్లమెంటులో గతంలో వందసార్లు సమస్యలను లేవనెత్తినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో బీజేపీ కార్యాలయంలో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ప్రజల కోసం ప్రణాళికతో చేసిన సంకల్ప పత్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డితో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని చెప్పారు. అంబేద్కర్ అడుగుజాడల్లోనే మోదీ సర్కారు పనిచేస్తోందని అన్నారు. విపక్షాలు చేస్తున్న లేనిపోని ఆరోపణలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ స్ఫూర్తితో మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చిందని చెప్పారు. గతంలో తాను ఎంపీగా పనిచేసినపుడు హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకై కేంద్రం నుంచి రూ. 930 కోట్లు విధులు తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. నేటికి పనులు ప్రారంభం కాలేదని విమర్శించారు. తాను ఎంపీగా గెలిచిని తరువాత రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించి పూర్తి చేస్తానని హామీనిచ్చారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం కింద చేవెళ్లకు లక్ష ఇళ్లను తీసుకువస్తానని హామీఇచ్చారు. అభివృద్ధి చేయకపోవడంతోనే రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాడని పరోక్షంగా విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ మల్లారెడ్డి, చేవెళ్ల ఆసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాష్, తూళ్ల వీరేందర్‌గౌడ్, అందెల శ్రీరాములు యాదవ్, పాపాయ్యగౌడ్, అంజన్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

బీజేపీకి మూడోసారి అధికారం ఖాయం: కిషన్‌రెడ్డి

కందుకూరు : ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసినా కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేత మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ జిట్ట రాజేందర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు కిషన్‌రెడ్డి సమక్షంలో నగరంలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలో చేరినవారిలో టంకరి మధుసూదన్ రెడ్డి, కె.మోహన్‌రెడ్డి, కె.సురేందర్‌రెడ్డి, ఎస్ దేవేందర్‌రెడ్డి, కె.వినోద్‌రెడ్డి, కె.విక్రంరెడ్డి, డి.శ్రీశైలం, కె.ప్రకాశ్‌రెడ్డిలు ఉన్నారు.

ఓబీసీ మహా సమ్మేళనానికి తరలిరావాలి

మొయినాబాద్ రూరల్ : బీజేపీ ఓబీసీ జిల్లా శాఖ అధ్వర్యంలో నేడు కంజర్లమాల్‌లో నిర్వహించే బీసీ సామాజిక మహాసమ్మేళన సభకు నాయకులు, కార్యకర్తలతో పాటు పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని జిల్లా అధ్యక్షుడు దుద్దెల్ల లక్ష్మీనారాయణ, జిల్లా కన్వీనర్ ఎల్గని వెంకటేష్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో శుక్రవారం వారు విలేకరులుతో మాట్లాడారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

చేవెళ్ల : లోక్‌సభ ఎన్నికల్లో బిజేపీ గెలుపే లక్ష్యంగా పార్టీ నాయకులు ముందుకు సాగాలని బీజేపీ చేవెళ్ల మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి కోరారు. శుక్రవారం చేవెళ్ల మండలంలోని కేసారం, పామెన, చేవెళ్ల గ్రామాల్లో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు.

బీజేపీకి మరో అవకాశం కల్పించాలి

ధారూరు : దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలను నేరుగా పేదలకు అందిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ నాయకులు ఓటర్లను కోరారు. ఎబ్బనూర్, బాచారం గ్రామాల్లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తరఫున పార్టీ నాయకులు శుక్రవారం ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.రమేశ్, వివేకానందర్‌రెడ్డి, పాండుగౌడ్ పాల్గొన్నారు.

విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

మోమిన్‌పేట్: బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అమ్రాది కుర్దు, అమ్రాదికలాన్ గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఆశిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహా రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారు

కులకచర్ల: ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం పడుతున్నారని, కేంద్రంలో మరోసారి మోదీ ప్రభుత్వం రాబోతోందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సౌమ్యరెడ్డి తెలిపారు. చెల్లాపూర్‌లో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మహిపాల్, మండల ప్రధాన కార్యదర్శులు హనుమంతు, నర్సింహారెడ్డి, జీ.మహిపాల్, కె.మహిపాల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్లను తనిఖీ చేసిన అధికారులు



సీసీ రోడ్డును తనిఖీ చేస్తున్న అధికారులు

యాచారం, ఏప్రిల్ 26 : మండలంలోని నంధివనపర్తిలో ఆర్‌అండ్‌బీ అధికారులు వేసిన సీసీ రోడ్డును రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ సీఈ సతీష్, ఎస్.ఇ చిన్నపుల్లాదాస్ శుక్రవారం ఉదయం తనిఖీ చేశారు. నిబంధనల మేరకు రోడ్డు పనులు నాణ్యంగా ఉన్నాయా అని ఆరా తీశారు. సీసీని ఎంత ఎత్తు వేశారోనని మిషన్‌తో తనిఖీ చేశారు. మండల కేంద్రం నుంచి కందుకూరులోని మీర్‌ఖాన్‌పేట వరకు రూ.78కోట్లతో రోడ్డు పనులు సాగుతున్న విషయం తెలిసిందే. వారి వెంట ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరి ఉన్నారు.

రోడ్డు పూర్తియ్యేదెన్నడో..

యాచారం మండలంలోని నజ్దిక్‌సింగారం కందుకూరు మండల పరిధిలోని మీర్‌ఖాన్ పేట గ్రామాల మధ్య మూడు కిలోమీటర్ల మేర పాత బీటీ రోడ్డును నాలుగు లేన్ల రహదారి వేయడం కోసంఅధికారులు తొలగించారు. నాలుగు నెలల క్రితం వేసిన మట్టి రోడ్డుపై కంకర వేసి, బీటీ రోడ్డు వేయాల్సి ఉన్నా అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మద్దతు ధర కల్పనకే కొనుగోలు కేంద్రాలు

ఆమనగల్లు, ఏప్రిల్ 26 : రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయశాఖ అధికారి అరుణకుమారి కోరారు. ఆమనగల్లు మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం అరుణకుమారి సందర్శించారు. ధాన్యం కొనుగోలును పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని ఆరబెట్టి 17తేమ శాతం ఉండేలా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి పద్మాకర్‌రెడ్డి, రైతు నాయకులు రామస్వామి, పద్మానాయక్, లక్ష్మీ, యాదయ్య, నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

ఓటర్లందరికీ పోల్ చిట్టీలు



స్లిప్‌లు పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

చేవెళ్ల, ఏప్రిల్ 26 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని ఓటర్లందరికీ పోల్ చిట్టీల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం మొదలు పెట్టామని తహసీల్దార్ బి. కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బూత్‌ల వారీగా ఇంటింటికి వెళ్లి అంగన్‌వాడీ సిబ్బంది, రెవెన్యూసిబ్బంది ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తారని చెప్పారు. మండలంలో మొత్తం 58,299 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఓటర్లందరికీ కచ్చితంగా ఓటరు స్లిప్‌లను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఓటరు స్లిప్‌తో నేరుగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాలని సూచించారు.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి



విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్, ఏప్రిల్ 26 : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పట్టణానికి చెందిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. విష్ణువర్ధన్‌రెడ్డిని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. బీజేపీ సిద్ధాంతాలు, నీతి నిజాయితీగా వ్యవహరిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన చెప్పారు.

బీఆర్ఎస్ యూత్ చేవెళ్ల అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



నియమాక పత్రాన్ని అందుకుంటున్న శ్రీధర్‌రెడ్డి

చేవెళ్ల, ఏప్రిల్ 26 : బీఆర్ఎస్ యూత్ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా వంగ శ్రీధర్‌రెడ్డి నియమితులైయ్యారు. ఈ మేరకు మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, చేవెళ్ల, ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతులు మీదుగా ఆయన నియమాక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో యూత్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం సంతోషకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



షాబాద్ : బొడ్రాయికి పూజలు చేస్తున్న గ్రామస్థులు

షాబాద్, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని దామర్లపల్లిలో బొడ్రాయి, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాలు, పూర్ణాహుతి, పారాయణాలు, నవగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, బొడ్రాయి ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలను వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి బొడ్రాయికి బోనాలు, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంపీటీసీ చెన్నయ్య, మాజీ సర్పంచ్ లింగం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

మడేలయ్య విగ్రహ ప్రతిష్ఠ

మొయినాబాద్/ మాడ్గుల : రజకుల ఆరాధ్యదైవం మడేలయ్య విగ్రహాన్ని శుక్రవారం మండల కేంద్రంలో రజక సంఘం మండలాధ్యక్షుడు భూతరాజు జంగయ్య ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గుడి వద్ద రజకులు పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అన్నేపాక జంగయ్య, మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్య గౌడ్ కాంగ్రెస్ నాయకులు సూదిని కోదండ వెంకట్‌రెడ్డి, జింకల బాస్కర్, శేఖర్ పాల్గొన్నారు.

'శ్రీలక్ష్మీనారాయణ' ఆలయ బ్రహ్మోత్సవాలు

తలకొండపలి : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ తిరుమని శేఖర్‌గౌడ్, వైస్ చైర్మన్ అంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. తొలిరోజు స్వామివారికి సుప్రభాత సేవత మేలుకొలుపు పాడారు. అనంతరం అఖండ దీపారాధన, గణపతి పూజ, స్వస్తివాచకం, మండపారాధన, పతాకావిష్కరణ, యజ్ఞం కార్య క్రమాలు నిర్వహించారు. అర్చకులు నర్సింహ్మయ్య, కామేశ్వరమూర్తిల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో హాజరైనారు. పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, హరికిషన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు భూమి పూజ

శంషాబాద్ రూరల్ : మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి, కిషన్‌గూడ 11వ వార్డులో స్థానిక కౌన్సిలర్ పారేపల్లి శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఆలయాలకు శుక్రవారం భూమిపూజ చేశారు. హైదరాబాద్ -బెంగుళూర్ జాతీయ రహదారికి సమీపాన ఉన్న హనుమాన్ దేవాలయంలో పార్వతి దేవి ఆలయం, పోచ్చమ్మ, హనుమాను ఆలయాలను పునఃనిర్మాణం చేయనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఏడాదిలోపు నూతన ఆలయాలను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తొండుపల్లి మాజీ సర్పంచ్‌లు, కిషన్‌గూడ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ది అవకాశవాద రాజకీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

కడ్తాల్, ఏప్రిల్ 26: రాజకీయ విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడల్లా బీఆర్ఎస్ నాయకులకు తెలంగాణ సెంటిమెంట్, అమరవీరుల స్థూపం గుర్తొస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అధికారానికి దూరమైన గులాబీ పార్టీ నాయకులు కాంగ్రెస్‌పై కుట్రలకు తెరలేపుతూ ఉనికిని చాటుకోవడానికి అసత్యపు ప్రచారాలు సాగిస్తున్నారని మండిపడ్డారు. మండలంలో శుక్రవారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మైసిగండిలో యువకులు పవన్, ప్రవీణ్ ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి కేంద్రాన్ని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీ మోత్యానాయక్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్‌లతో కలిసి ప్రారంభించారు. పలు గ్రామాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈసందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించాలని కోరారు. రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు రాంచందర్‌నాయక్, కిషన్‌నాయక్, రాందాస్‌నాయక్, తులసీరాంనాయక్, జవహర్‌లాల్‌నాయక్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

● మాజీ ఎంపీపీ బాల్‌రాజ్



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్ల, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయాలని, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ ఎంపీపీ. బాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి. ప్రభాకర్ కార్యకర్తలకు పిలునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో వారు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్‌లు నర్సింలు, చింటు, నాయకులు కృష్ణ, మహేశ్, నర్సింలు, రామగౌడ్, బుచ్చయ్యగౌడ్, పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలవి కుట్ర రాజకీయాలు



మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఏప్రిల్ 26: కాంగ్రెస్, బీజేపీలవి కుట్ర రాజకీయాలని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల భ్రమలు తొలగాయని, హామీలను విస్మరించి మోసగించిన ఆ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు అభివృద్ధిని విస్మరించి రాజకీయ లబ్ది కోసం కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహం, శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో విజయవంతంపై చర్చించారు. రోడ్‌షోకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి దాదాపు 10వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, వైస్ ఎంపీపీ ఆనంద్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రప్రభుత్వ నిధులతోనే ప్రగతి



యాచారం : ప్రచారం చేస్తున్న నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం/ యాచారం/ మంచాల : కేంద్రప్రభుత్వం ఇచ్చిన నిధులతోనే గత ప్రభుత్వం, నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాలను అభివృద్ధి చేశాయని బీజేపీ భువనగిరి ఎంపీ అభ్యర్థి డా.బూర నర్సయ్యగౌడ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాల్లోని వివిధ గ్రామాల్లో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ బీజేపీ మినహా గతంలో ఏప్రభుత్వం పేదలను ఆదుకోలేదన్నారు. తమ ప్రభుత్వం నిరుపేదలకు అండగా ఉంటుందని చెప్పారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమాలలో బీజేపీ నాయకులు లచ్చి రెడ్డి, రాజేశ్వరీ, నర్సింహారెడ్డి, బండి రాజు, వెంకటేష్, జయశ్రీ, యాచారం ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, మేకల యాదగిరిరెడ్డి, తాండ్ర రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

ఒంటెత్తు పోకడలు మానుకోవాలి

● కాంగ్రెస్ సీనియర్ నాయకులు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

శంకర్‌పల్లి, ఏప్రిల్ 26 : కాంగ్రెస్ చేవెళ్ల ఎంపి. అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి ఒంటెఎత్తుపోకడలు మనుకోవాలని కాంగ్రెస్ శంకర్‌పల్లి మండల ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నసీరుద్దీన్ అన్నారు. శుక్రవారం రాత్రి కాంగ్రెస్ మండల కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నాయకులు తమను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా పోయేదా అని హేళన చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలోకి రాగానే నాడు అవహేళన చేసిన వారే నేడు కాంగ్రెస్ పార్టీలో చేరి గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ స్కూల్ నుంచి వచ్చిన రంజిత్‌రెడ్డి ఫామ్‌హౌస్‌లో ఇతర పార్టీ నాయకులను ఎవరికి చెప్పకుండా చేర్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భీంభరత్ ఓటమికి పనిచేసిన నాయకులకే కాంగ్రెస్‌లో చేరిన అనంతరం ప్రాధాన్యత దక్కుతుందని, సీనియర్ నాయకులను అనగదొక్కడం ఏంటని ప్రశ్నించారు. రంజిత్‌రెడ్డి ఇప్పటికైనా అందరిని కలుపుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు రంగారెడ్డి, నరసింహారెడ్డి, రాజిరెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, విష్ణుకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అమెజాన్ ప్రతినిధులు

కందుకూరు, ఏప్రిల్ 26 : గ్రామీణ ప్రాంతాలలో మరుగున పడుతున్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమ సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందని అమెజాన్ సంస్థ ప్రతినిధులు డేవిడ్, క్రిష్, ప్రకాష్‌లు చెప్పారు. మండంలోని బేగరికంచలో ప్రాథమిక పాఠశాలతో పాటు అంగన్‌వాడి భవనాలకు అన్ని హంగులతో ఆ సంస్థ ద్వారా అభివృద్ధి చేశారు. బేగరికంచ గ్రామపంచాయతీలో తమ సంస్థ ద్వార అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించడంతో పాటు ఈ గ్రామాభివృద్ధికి తమ వంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో మండల విద్యాధికారి మనోహర్, సీడీపీవో షభానాబేగం, సెర్ప్ ఆర్గనైసేషన్ కో-ఆర్డినేటర్ సురేష్, మరియె ఆమెజాన్ సంస్థకు చెందిన సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే



రోడ్ షోలో ప్రసంగిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 26 : తెలంగాణలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ కుటుంబం రూ.వేల కోట్లు అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం టౌన్‌లో కాంగ్రెస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి కాంగ్రెస్ రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. అనంతరం చౌరస్తాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి ఎన్నికల్లో నెగ్గడానికి బీజేపీ ప్రయత్నం చేస్తోందని ఈ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు గ్యారంటీలు అమల్లోకి వచ్చాయని ఆగస్టు 15 నాటికి రైతు రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కిరణ్‌కుమార్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ర్యాలీలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి, జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం

కొత్తూర్, ఏప్రిల్ 26 : మండల కేంద్రానికి సమీపంలో గల రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గురువారం రాత్రి గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. దాదాపు 45సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి రైలు పట్టాల పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తుండగా, గుర్తు తెలియని ఓ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడు బ్లూకలర్ జీన్స్‌ప్యాంట్, బ్లాక్ కలర్ షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ మాస్టర్ పురుషోత్తం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు 9848090426 సెల్‌నెంబర్‌కు సమాచారం అందించాలని ఆయన చెప్పారు.

మోసానికి ఒడిగట్టిన నలుగురికి జరిమానా

ఆమనగల్లు, ఏప్రిల్ 25: మోసానికి పాల్పడిన నలుగురు వ్యక్తులకు ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించిందని ఆమనగల్లు ఎస్సై బాల్‌రాంనాయక్ తెలిపారు. నగరంలోని చంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్ సయ్యద్ 2020లో ద్విచక్రవాహనం పోయిందని అక్కడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. కాగా, పాత సామాన్ల వ్యాపారం చేసుకునే ఆమనగల్లు పట్టణానికి చెందిన ముజాహిద్ గుర్తుతెలియని వ్యక్తి నుంచి 2021లో ఒక మోటార్‌సైకిల్‌ను కొనుగోలు చేశాడు. దానిని అప్పర్‌కు విక్రయించగా, అతను సిల్వేరు ప్రేమ్‌కుమార్, వసంత, సహాయంతో వాహనాన్ని రంగు, నెంబర్ ప్లేట్ మార్చి తిరుగుతుండగా పోలీసులు పట్టుకుని చంద్రాయణగుట్టలో మిస్సింగ్ అయిన అబ్దుల్ సయ్యద్‌దిగా గుర్తించి కేసు నమోదు చేసి ఛార్జిషీటు వేశారు. రంగు, నెంబర్ ప్లేటు మార్చడం నేరంగా భావించిన కోర్టు సదరు వ్యక్తులకు రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

యాచారం, ఏప్రిల్ 26 : పాముకాటుతో ఓ రైతు మృతిచెందిన ఘటన హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకుల మైలారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆకుల మైలారంకు చెందిన పోల్కం జంగయ్య(60) అనే రైతు తన వ్యవసాయ పొలంలో పాలకూర కట్టలు కడుతుండగా పాముకాటు వేసింది. దాంతో అతని కుటుంబసభ్యులు, బంధువులు చికిత్స కోసం నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు.

పోగొట్టుకున్న పర్సు స్వాధీనం

ఆమనగల్లు, ఏప్రిల్ 26: కూరగాయల మార్కెట్లో ఓ వ్యక్తి పర్సును పోగొట్టుకోగా.. సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించి బాధితుడికి అందజేశారు. ఎస్సై బాల్‌రాంనాయక్ కథనం ప్రకారం.. ఆమనగల్లు మున్సిపాలిటీ సాకిబండతండాకు చెందిన బీచ్యనాయక్ ఈనెల 25న ఆమనగల్లు కూరగాయల మార్కెట్‌కు వచ్చిన సమయంలో తన పర్సును పోగొట్టుకున్నాడు. వెంటనే ఆమనగల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పెట్రోలింగ్ మొబైల్ కానిస్టేబుల్ శివకుమార్, సీసీ టీవీల ఇన్‌చార్జి రఘునాయక్‌లు దర్యాప్తు ప్రారంభించారు. ఈమేరకు పర్సు తీసుకున్న వ్యక్తిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పర్సులో ఉన్న రూ.3,500 నగదును బాధితుడు బీచ్యనాయక్‌కు అందజేశారు.

రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచిన శ్రీవర్షిణి



శ్రీవర్షిణి ని సన్మానిస్తున్న గ్రామస్తులు

షాబాద్, ఏప్రిల్ 26 : షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ గ్రామానికి చెందిన పరిగి శ్రీవర్షిణి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచారు. దీంతో ఆమె తల్లిదండ్రులు ప్రభాకర్‌గౌడ్, జ్యోతి, గ్రామస్థులు బందయ్య, వెంకటేష్‌గుప్తా, నాగరాజు, శివకుమార్, అభిరామ్ తదితరులు శ్రీవర్షినిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కని బందయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఇంటర్ ప్రథమసంవత్సరంలో ప్రతిభ కనబరిచిన శ్రీవర్షిణి మండలానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకువచ్చిందన్నారు. పలువురు నాయకులు ఆమెను అభినందించారు.

ఉత్తమ ప్రతిభ చాటిన ప్రణీత్‌గౌడ్



సన్మానిస్తున్న గ్రామస్తులు

కేశంపేట : మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన లెంకపోతుల ప్రణీత్‌గౌడ్ అనే విద్యార్థి ఈ నెల 24న ప్రకటించిన ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీలో 467 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ చాటాడు. ఈ మేరకు గ్రామస్థులు శుక్రవారం అతన్ని శాలువాతో సత్కరించారు. రాష్ట్రస్థాయిలో తమ గ్రామం పేరు నిలబెట్టినందుకు అభినందించారు. భవిష్యత్తులో చదువులో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అకాంక్షించారు. కార్యక్రమంలో అబ్బి సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, శివానందు, రవీందర్, రాఘునందన్, రామస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్‌షోకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



తరలివెళుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తూర్, ఏప్రిల్ 6 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రోడ్‌షోకు మున్సిపాలిటీతో పాటు, మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న కేసీఆర్‌కు షాద్‌నగర్ బైపాస్ రోడ్డు వద్ద భారీ స్వాగతం పలికి, అయన కాన్వాయితో తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో బి. దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్‌గౌడ్, డోలీ రవీందర్, కోస్గి శ్రీనివాస్, మాదారం నర్సింహ్మగౌడ్, రవినాయక్, శ్రవణ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవితం



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న నిట్ట నారాయణ

ఆమనగల్లు : ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని కాంగ్రెస్ నాయకులు నిట్ట నారాయణ, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ అన్నారు. మండలంలోని గౌరారం గ్రామంలో గల జహంగీర్ బాబా దర్గా వద్ద శుక్రవారం కందూర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రార్థనల్లో స్థానికులు పాల్గొన్నారు. నారాయణ, మంగమ్మ దర్గాలో పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కులం, మతం కంటే మానవత్వం గొప్పదని, అన్ని మతాల సారాంశం అదేనని అన్నారు. దైవ కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ పాలుపంచుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● చేవెళ్ల : గృహజ్యోతి పథకం కింద అర్హులైన ప్రజలందరు కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం చేవెళ్లలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా గృహజ్యోతి పథకం కింద ఎంపిక చేసిన లబ్దిదారులు ఎవ్వరు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవద్దన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని ప్రజలపై ఒత్తిడి చేయొద్దన్నారు. ప్రజలందరు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అధికారులు ప్రజలను తప్పుతోవ పట్టిస్తూ విద్యుత్ బిల్లులు కట్టించుకుంటున్నారని మండిపడ్డారు.

● కడ్తాల్ : జడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఉదారత చాటుకున్నారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూతనందించారు. మండలంలోని కానుగుబాయి తండాకు చెందిన నేనావత్ సుగుణ, బీమా దంపతుల కూతురు మాన్విక వివాహం జరిగింది. కడ్తాల జడ్పీటీసీ దశరథ్ నాయక్ జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.21వేలు సమకూర్చారు. శుక్రవారం నగదు, పట్టుచీరను నవవధువు మాన్వికకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, పీఏసీఎస్ డైరెక్టర్ సేవ్యానాయక్, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులున్నారు.

● కడ్తాల్ : ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయినంత మాత్రాన జీవితం పాడైందని బాధపడరాదని కడ్తాల్ జెడ్పీటీసీ దశరథ్ చెప్పారు. కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామంలో ఇంటర్ ఫెయిల్ అయిన పాండు,పుష్పదంపతుల కుమారుడు ఉదయ్‌కిరణ్(17) ఆత్మహత్యచేసుకున్నాడు, మృతుడి కుటుంబీకులను ఆయన పరామర్శించారు. శవపరీక్ష అనంతరం రావిచేడ్ గ్రామానికి సాయంత్రం తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు. మృతుడి కుటుంబీకులను ఆ యనతో పాటు రైతు బంధు మాజీ కో ఆర్డినేటర్ వీరయ్య, మాజీ ఎంపీటీసీ యాదయ్య, మాజీ సర్పంచ్ భారతమ్మ, రమేష్ తదితరులున్నారు.

● ఆమనగల్లు : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఆమనగల్లు కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, వివాహాది వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నాలాపురం శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ తలకొండపల్లి మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు గురువయ్య, రాజు, అశోక్, మల్లేశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

● ఆమనగల్లు : ఆమనగల్లు, కడ్తాల మండలాల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నేడు(శనివారం) ఉదయం 9గంటలకు ఆమనగల్లు మండలంలోని అయ్యసాగరం గేటు సమీపంలోని డీఎంకే ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ ఓ ప్రకటనలో తెలిపారు. లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశానికి కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు.సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు.